## గజల్ కవయిత్రి మల్లీశ్వరికి ప్రపంచ రికార్డులు



రికార్డు పత్రాలను చూపిస్తున్న మల్లీశ్వరి

చిక్కడపల్లి, నవంబర్ 2 : సుప్రసిద్ధ గజల్ కవయిత్రి, తొలి తెలుగు గజల్ వాగ్గేయకారిణి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి గజల్ రచన, గానంలో చేసిన విశేషకృషికి గుర్తింపుగా చాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ నుంచి రెండు విశిష్ట రికార్డులు లభించాయి. మల్లీశ్వరి రాసిన పది గజల్ సంకలనాలకు ఛాంపియన్ ఆఫ్ గజల్స్ రికార్డు లభించింది. ఈ సందర్భంగా పలువురు కవులు, రచయితలు కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ, జీవన్‌లాల్ లవాడియా, సురారం శంకర్, చల్లా రాంబాబు, మంజుల యనమదల, లక్ష్మీ భావని, శాంతినిర్మల, రాఘవ, మాధవ్ తదితరులు మల్లీశ్వరికి అభినందనలు తెలిపారు.

## వాహనాల తనిఖీ ..



ముషీరాబాద్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ జహంగీర్ యాదవ్, ఎస్సై స్వప్న

కవాడిగూడ, నవంబర్ 2 : త్వరలో జరగనున్న ఎన్నిక నేపథ్యంలో ముషీరాబాద్ చౌరస్తాలో సీఐ జహంగీర్ యాదవ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సరైన ధ్రువ పత్రాలు లేకుండా నగదు, బంగారం, మద్యం తరలిస్తే వాటిని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలమేరకు ప్రతి రోజు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై స్వప్న, పోలీసులు పెద్దెత్తున పాల్గొన్నారు.

## అల్పాహారం, పండ్లు పంపిణీ..



అల్పాహారం పంపిణీ చేస్తున్న కృష్ణ

చిక్కడపల్లి, నవంబర్ 2 : కందూరి కృష్ణ ఫౌండేషన్, సేట్ మానిక్ లాల్ ఫౌండేషన్ సంయుక్త గురువారం చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి తదితర ప్రాంతాల్లో పేదలకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నాయకుడు కందూరి కృష్ణ మాట్లాడుతూ.. పేదలను ఆదుకోవడం సామాజిక బాధ్యత అన్నారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు ప్రతి రోజూ అల్పాహారం, పండ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ ఫౌండేషన్ చచైర్మన్ ప్రమోద్ అగర్వాల్, అడ్వికేట్ కందూరి కౌషిక్, జ్వాలా వరలిణి, అడ్వకేట్ గోవింద్‌రావు, మౌనిక తదితరులు పాల్గొన్నారు

## ఆర్థిక సాయం..

ముషీరాబాద్, నవంబర్ 2: అనారోగ్యంతో బాధపడుతున్న ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు పి.గణేశ్‌కు గురువారం మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి నాయిని నర్సింహారెడ్డి ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బీఆర్‌ఎస్ నేతలతో కలిసి గణేశ్ నివాసానికి వెళ్లిన వీఎస్‌ఆర్ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు భిక్షపతి యాదవ్, నేత శ్రీనివాస్, అజయ్ ముదిరాజ్, వీరస్వామి, వెంకటేశ్వరరావు, బాల్‌రాజ్ గౌడ్, సిరిగిరి శ్యామ్, కార్తీక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## టికెట్ రాకపోవడంతో భంగపడ్డ బీజేవైఎం నాయకుడు

చిక్కడపల్లి, నవంబర్ 2 : ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ టికెట్ కోసం ప్రయత్నం చేసిన బీజేవైఎం పూర్వ నగర అధ్యక్షుడు ఎ.వినయ్ కుమార్ టికెట్ వేరే వారికి కేటాయించడంతో భంగపడ్డారు. టికెట్ కోసం నెల రోజులుగా ఢీల్లీ స్థాయిలో ప్రయత్నాలు చేసినప్పటికీ, ఊహించని రీతిలో టికెట్ తనకు రాకపోవడంతో భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకునేందుకు సిద్ధ మైతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్



అడిక్‌మెట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ముషీరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్

ముషీరాబాద్ / కవాడిగూడ, నవంబర్ 2: ముషీరాబాద్ నియోజకవర్గంలో గత ఐదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠా గోపాల్ కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్న బీఆర్‌ఎస్‌కు మరోమారు అశకాశం ఇస్తే బస్తీలు, కాలనీల్లో అభివృద్ధి మరింత వేగంగా ముందుకు సాగుతుందన్నారు. గురువారం అడిక్‌మెట్ డివిజన్‌లోని పలు బస్తీల్లో పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నేరుగా ఓటర్లను కలిసి ముఠా గోపాల్ మీ బస్తీల్లో రోడ్డు వేసింది, నిరంతరం కరెంటు, మంచినీరు సరఫరా చేస్తున్నది ఎవరో గమణించి ఓట్లు వేయాలని కోరారు. ప్రజల మధ్య ఉండి నిత్యం ప్రజా హితం కోసం పరితపించే నేతను ఎన్నుకోవాలని కోరారు. తాను ఎమ్మెల్యే గెలిచిన తరువాత అడిక్‌మెట్ డివిజన్‌లో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మూడు దశాబ్దాలుగా పరిష్కారం నోచుకొని లలితానగర్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించిన ఘనత తమదేన్నారు. ప్రతి బస్తీలో రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడంతోపాటు అర్హులైన వారికి పెన్షన్‌లు అందిస్తున్నామని, పని చేసే ప్రభుత్వానికి ఓటు ద్వారా మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

**సమస్యల పరిష్కరించేది బీఆర్‌ఎస్‌దే..**

దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకొని సమస్యలను పరిష్కరించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని, అభివృద్ధిని కొనసాగించడానికి బీఆర్‌ఎస్ గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం చరిత్రంతో ఎన్నడూ లేనివిధంగా వెయ్యి కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చిన అభివృద్ధి పనులు చేట్టానని, వరద సమస్యలను పరిష్కరించిన ఘనత తనదేనన్నారు. నియోజకవర్గానికి ఎన్నికలప్పుడు వచ్చేపోయే నేతలు చెప్పే మాయమాటలు నమ్మవద్దని, పని చేసేటోళ్లకు ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ముఠా జయసింహ, బి.శ్రీనివాస్‌రెడ్డి, కె.సురేందర్, రవియాదవ్, శ్యామ్‌సుందర్, మాధవ్, బొట్టు శ్రీనివాస్, మల్లికార్జున్‌రెడ్డి, మహ్మద్ ఖదీర్, సయ్యద్ అస్లాం, యూనిస్, అబ్బు, రాజు తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌తోనే మహిళా సంక్షేమం సాధ్యం..**

మహిళా సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం అని ఎమ్మెల్యే, ముషీరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. ఈ మేరకు గురువారం భోలక్‌పూర్‌లోని గంగపుత్ర భవనంలో స్థానిక బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు అధ్వర్యంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌తో హాజరై మాట్లాడారు.

**పఠాన్‌బస్తీలో బీఆర్‌ఎస్‌లో చేరికలు...**

ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమక్షంలో భోలక్‌పూర్ డివిజన్ పఠాన్ బస్తీలో ముస్లింలు పెద్దెత్తున బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ముఠా జయసింహ, డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, నాయకులు రెబ్బరామారావు, శాషెద్, షయ్యర్ షెకిల్, రహీం, సయ్యద్ అహ్మద్ భక్తియార్ పాల్గొన్నారు.



అడిక్‌మెట్‌లో గ్యాస్ సిలిండర్‌తో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు




భోలక్‌పూర్‌లో మహిళా కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్

# నేటి నుంచే నామినేషన్ల స్వీకరణ

- ముషీరాబాద్ తాసీల్దార్ కార్యాలయంలో ఏర్పాట్లు పూర్తి
- నామినేషన్ల స్వీకరణ 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు
- చివరి తేదీ 10-11-2023, ఉపసంహరణ 15-11-2023
- నవంబర్ 30న పోలింగ్, డిసెంబర్ 03న ఎన్నికల కౌంటింగ్
- ఆర్‌ఓ లక్ష్మీనారాయణ



ముషీరాబాద్, నవంబర్ 2: తెలంగాణ శాసనసభకు త్వరలో జరుగనున్న ఎన్నికలను పురస్కరించుకొని ముషీరాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం(నేటి)నుంచి నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ మొదలై 10 తేదీన ముగిస్తుంది. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ముషీరాబాద్ తాసీల్దార్ కార్యాలయం కేంద్రంగా ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియ కొనసాగుతుందని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ నామినేషన్ దాఖలు చేసే క్రమంలో ఎన్నికల నియమావళిని అభ్యర్థులు ఖచ్చితంగా పాటించాలని, కోడ్ ఉల్లగిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ దాఖలు చేయవచ్చునని తెలిపారు. నామినేషన్ దాఖలుకు వచ్చే వారి వెంట ఐదుగురిని మాత్రమే ఎన్నికల కార్యాలయంలోకి అనుమతిస్తామని, ఆర్‌ఓ కార్యాలయానికి వంద మీటర్ల లోపు మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, అభ్యర్థి వెంట వచ్చే వారు 100 మీటర్లు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి అభ్యర్థి నామినేషన్ పత్రాలతోపాటు ఓటరు గుర్తింపు కార్డు, ఫోటోలు, చాలానకు సంబంధించి నగదు డిపాజిట్ చేయవచ్చునని తెలిపారు. నామినేషన్ వెయ్యడానికి అభ్యర్థితో వచ్చే వారు నామినేషన్ దాఖలు పూర్తయ్యే వరకు భయటకు వెళ్లరాదని, అవసరమైన అన్ని పత్రాలతో రావాలని సూచించారు.

**ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు..**

ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల కోడ్‌ను అనుసరించాల్సి ఉంటుంది. ప్రతి అభ్యర్థి ప్రచారంపై నిఘా కొనసాగుతుందని ఆర్‌ఓ స్పష్టం చేశారు. అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి సంబంధించి సువిధ ఆప్(ఆన్‌లైన్‌లో) ద్వారా 48 గంటల ముందుగా దరఖాస్తు చేసి ప్రచారం, ర్యాలీలకు సంబంధించిన అనుమతిని పొందవచ్చునని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని ఉల్లఘించకుండా నిరంతర నిఘా ఉంటుందని చెప్పారు. ఎన్నికల విధుల కోసం ఎస్ఎస్, ఫ్లైయింగ్ స్కాడ్ టీం, విజువల్ సర్వైవలెన్స్, వీడియో విజువల్ టీం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలను నియమించినట్లు తెలిపారు. అంతేకాకుండా ఏసీపీ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని, సెలక్టోరియల్ ఆఫీసర్స్ ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేస్తారని అన్నారు.